ప్రజాశక్తి
మంగళవారం 22 ఏప్రిల్ 2025 5 అనంతపురం

వృద్ధురాలి సమస్యను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్, ఎమ్మెల్యే

అర్జీలకు త్వరితగతిన పరిష్కారం

◆కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్, ఎమ్మెల్యే సునీత
◆రాప్తాడులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి-రాప్తాడు

వివిధ సమస్యలపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు అందించే అర్జీలను పరిశీలించి త్వరితగతిన వాటిని పరిష్కరించాలని కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సంబంధిత అధికారులను ఆదేశించారు. రాప్తాడు మండల పరిధిలోని ప్రసన్నాయనపల్లి గ్రామం ఆర్‌జెసి కల్యాణ మండపంలో రాప్తాడు మండల స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కలెక్టర్, ఎమ్మెల్యే ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి 407 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం చేయరాదన్నారు. జిల్లా అధికారులందరూ టూర్ డైరీలను కలెక్టర్ కార్యాలయానికి సబ్మిట్ చేయాలన్నారు. ఈనెల 23వ తేదీన జిల్లాస్థాయిలో 'పోషణ పక్వాడ' కార్యక్రమాన్ని చేపట్టేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఐసిడిఎస్ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ మండల స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించడం హర్షణీయం అన్నారు. కార్యక్రమంలో ప్రజల అందించిన అర్జీలకు పరిష్కారం చూపేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

అనంత ఆణిముత్యాలకు సాయం అందించండి : కలెక్టర్

పేద విద్యార్థుల విద్యాభ్యాసంకు సంబంధించి ఏర్పాటు చేసిన అనంత ఆణిముత్యాల ఎడ్యుకేషన్ సొసైటీకి రూ.1,34,116 మెగా చెక్‌ను కలెక్టర్ అందజేశారు. ఇందుకోసం వ్యక్తిగతంగా ఆయన రూ.10వేలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సాయం అందించి పేద విద్యార్థులకు బాసటగా నిలవాలని కోరారు. ఇందుకోసం సాయం అందించాలనుకునే వారు అనంత ఆణిముత్యాలు ఎడ్యుకేషన్ సొసైటీ విరాళాలను జిల్లా కలెక్టర్, అనంతపురం అకౌంట్ నెంబర్: 142910011001235, ఐఎఫ్‌సి కోడ్ UBIN0814296కు ఫోన్ పే ద్వారా కానీ, గూగుల్ పే ద్వారా కానీ చెల్లించవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, డిఆర్‌ఒ ఎ.మలోల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తిప్పేనాయక్, మల్లికార్జున, రామ్మోహన్, ఆర్డీవో కేశవ నాయుడు, డిపిఒ నాగరాజు నాయుడు, జెడ్పీ సిఇఒ రామచంద్ర రెడ్డితో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆగని భూపందేరం..!

◆సోలార్ పేరుతో 'కార్పొరేట్'కు భూములు
◆రెవెన్యూ విక్రాంత్ సంస్థకు అప్పగిస్తూ నిర్ణయం
◆గుత్తి-పామిడి మధ్య కేటాయింపు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లాలో సోలార్ కంపెనీలకు భూ కేటాయింపుల పందేరం ఆగటం లేదు. వేల ఎకరాలు భూటాయింపులు కార్పొరేట్ కంపెనీలకు కేటాయిస్తూనే పోతున్నారు. ఇప్పటికే వేల ఎకరాలు భూకేటాయింపులు సోలార్ కోసం ఇచ్చారు. తాజాగా మరో కంపెనీకి వేలాది ఎకరాలను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రెవెన్యూ విక్రాంత్ సంస్థకు పెద్ద ఎత్తున అనుమతులను ఇచ్చారు.

గుత్తి-పామిడి మధ్య కేటాయింపు

జిల్లాలోని గుత్తి-పామిడి మధ్య ఈ ప్రాజెక్టు మంజూరైంది. 540 మెగావాట్లు ఎసి / 753 మెగావాట్లు డిసి సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ ఏర్పాటుకు ఆమోదం ఇచ్చారు. గుత్తి-పామిడి మండలాల పరిధిలోని ఊటకల్లు, ఊబిచర్ల, బేతాపల్లి, మామడూరు, ఇడుగూరు గ్రామాల పరిధిలో సోలార్ ప్రాజెక్ట్ నిర్మాణానికి అనుమతులు ఇచ్చారు. ఈ గ్రామాల పరిధిలో సోలార్ పవర్ ప్రాజెక్ట్ రానుంది. దీనికి నిర్దిష్టంగా కేటాయింపులు ఎంత అన్నది నిర్ణయించలేదు. లీజు పద్ధతిలో భూములను కంపెనీయే సేకరించినందుకు అనుమతులు ఇచ్చారు. ఏడాదికి 31 వేల చొప్పున లీజు ఉండే విధంగా నిర్ణయించారు. రెండు సంవత్సరాలకు ఒకసారి ఐదు శాతం లీజు పెంచాలని పెంచాలని ఉత్తర్వులు పేర్కొనడం జరిగింది.

ఇప్పటికే పెద్ద ఎత్తున అనుమతులు

సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున అనుమతులు ఇచ్చి ఉంది వేలాది ఎకరాలు ఇందుకోసం కేటాయించారు. ఇంతపెద్ద ఎత్తున భూమిని ఒకే జిల్లాలో కేటాయిస్తుండడంపై విపక్షాల నుంచి పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాబోయే రోజుల్లో జిల్లాలో వ్యవసాయానికి సాగుభూమి కూడా కరువే పరిస్థితులు నెలకునే అవకాశం ఉందని ఆందోళన ను వ్యక్తం చేస్తున్నారు.

25 నుంచి ఆర్‌డిటి సెట్‌కు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

ఆర్‌డిటి సెట్‌కు సన్నద్ధమయ్యే విద్యార్థులకు ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీ నుంచి ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సమన్వయకర్త అశోక్ కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం స్థానిక కరణం చిక్కప్ప ఉన్నత పాఠశాలలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడు తూ పదో తరగతి పాసైన విద్యార్థులను ఆర్‌డిటి సంస్థ కార్పొరేట్ కళాశాలలో ఉచితంగా ఇంటర్ చదివిస్తుందని, అందుకోసం ముందుగా ఆర్‌డిటి సెట్ నిర్వహిస్తుందన్నారు. సమావేశంలో శెట్టూరు ఎంఇఒ శ్రీధర్, ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రాయల్ వెంకటేశ్వర్లు, యుటిఎఫ్ నాయకుడు ఈశ్వరయ్య, ఎస్‌టియు నాయకులు మల్లికార్జునగౌడ్, టిఎన్‌ఎస్‌యు నాయకుడు నరసింహులు, ఎస్‌ఆర్‌టిఎ నారాయణ, ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్ట్ తరఫున బద్దె నాయక్, ఉపాధ్యాయులు నరసింహారెడ్డి, అబ్దుల్ వహాబ్, తిప్పేస్వామి, సబ్జెక్ట్ నిపుణులు షాజహాన్, సతీష్, మురళి, మల్లికార్జున, చిరంజీవి పాల్గొన్నారు.

25న రాణిసత్రం టోల్ గేట్ వేలం

రాయదుర్గం : పట్టణంలోని రాణిసత్రం టోల్ గేట్ రుసుము వసూలుకై ఈ నెల 25వ తేదీ ఉదయం 11 గంటలకు కోటలోని ప్రసన్నవెంకటరమణస్వామి ఆలయ ఆవరణలో వేలం పాట నిర్వహిస్తున్నట్లు దేవాదాయ శాఖ సమూహ దేవాలయాల ఈవో నరసింహారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాణి సత్రం ఆవరణలో ప్రయివేటు వాహనాలు, తోపుడుబండ్లపై తాత్కాలిక వ్యాపారం చేసుకునే వారి నుంచి టోట్‌గేట్ రుసుము వసూలు చేసేందుకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు రూ. లక్ష ధరావత్తు చెల్లించాలన్నారు.

ఈదురు గాలుల బీభత్సం నేలకొరిగిన బొప్పాయి

అప్పేచెర్లలో నేలకొరిగిన బొప్పాయి చెట్లు

మండలంలో ఆదివారం రాత్రి ఈదురుగాలులు బీభత్సవం సృష్టించాయి. గాలుల దెబ్బకు మండలంలోని అప్పేచెర్లకు చెందిన రైతు విరుపాక్షిరెడ్డి పొలంలో సాగుచేసిన బొప్పాయి చెట్లు విరిగి నేలపడ్డాయి. రైతు సాగు చేసిన నాలుగు ఎకరాల్లో పంట మొత్తం నేలకొరిగింది. కాయల కాసి, కోత దశలో ఉన్న సమయంలో పంట మొత్తం నేలపాలైందని రైతు కన్నీటి పర్యవంతం అయ్యాడు. ఉద్యానశాఖ, రెవెన్యూ అధికారులు పంటలను పరిశీలించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశాడు.

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం

ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాలవ

విద్యార్థులకు వ్యక్తిగత క్రమశిక్షణ చాలా అవసరమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సూచించారు. మండలంలోని 74-ఉడేగోళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల 44వ వార్షికోత్సవాన్ని సోమవారం కళాశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. కాలవ మాట్లాడుతూ విద్యార్థులు తమ ఆశలు, తల్లిదండ్రులు ఆశయాలను నెరవేర్చేలా బాగా చదివి అత్యున్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరితో కలిసిమెలిసి జీవించాలని, సామాజిక స్పృహ అలవర్చుకోవాలన్నారు. క్షణికావేశాలకు పోకుండా ప్రశాంతంగా ఆలోచించాలన్నారు. డిగ్రీ కళాశాల అభివృద్ధికి ఎప్పుడూ తనవంతు సహకారం ఉంటుందన్నారు. దశల వారీగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వివిధ పోటీల విజేత విద్యార్థులకు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీరామ్మూర్తి, జనసేన నాయకులు మంజునాథ్‌గౌడ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ బావి అక్రమ రిజిస్ట్రేషన్ రద్దుకై విజ్ఞప్తి

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని బళ్లారి రోడ్డులో ఉన్న గంగమ్మ బావి స్థలాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించారని, తక్షణమే దానిని రద్దు చేయాలని కోరుతూ సోమవారం మాజీ కౌన్సిలర్ పోరాలు ధనార్జన, రామ చంద్రప్ప, స్థానికులు మున్సిపల్ ఛైర్‌పర్సన్ పోరాలు శిల్పకు వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ 110 ఏళ్ల క్రితం గడిగే గంగమ్మ బావి తవ్వించగా ప్రజలు ఆ బావి నీటిని ఉపయోగిస్తూ వచ్చారన్నారు. 35 ఏళ్లుగా వినాయక ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏటా వినాయక చవితి సందర్భంగా గణేశుని ప్రతిమను ఉంచి పూజలు చేస్తున్నట్లు తెలిపారు. 1993లో స్థానికుల విరాళాలతో మోటార్ ఏర్పాటు చేసి తొట్టెను నిర్మించి ప్రజల అవసరాల కోసం ఉపయోగిస్తున్నారన్నారు. దీని విద్యుత్ బిల్లును పుర పాలక సంఘమే చెల్లిస్తుందన్నారు. 2004లో ఈ భావి స్థలాన్ని ఒక షెడ్డుగా చూపి కామ్మూర్తి అశ్విని పేరిట అక్రమంగా పొజిషన్ సర్టిఫికెట్‌ను పొందారన్నారు. 2024లో ఆమె ఆ పట్టాను కామ్మూర్తి లక్ష్మీనరసింహస్వామికి దాన విక్రయంగా అనంతపురం రిజిస్టర్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించి నట్లు వెల్లడైందన్నారు. ఈ బోగస్ పట్టా, రిజిస్ట్రేషన్‌ను రద్దుచేసి గంగమ్మ బావిని ప్రజల సార్వత్రిక ఆస్తిగా పరిగణించేలా చర్యలు చేపట్టాలని వారు కోరారు.

బెట్టింగ్, మత్తుపదార్థాల జోలికెళ్లొద్దు

సిఐ యువరాజ్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

యువత బెట్టింగ్, మట్కా, గంజాయి, మత్తు పానీయాల జోలికెళ్లి ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని పట్టణ సిఐ యువరాజ్ సూచించారు. సులభంగా డబ్బులు సంపాదించవచ్చనే ఆశతో ఇటీవల కాలంలో యువత ఎక్కువగా ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతూ రూ. లక్షలు పోగొట్టుకుంటున్నారన్నారు. అలాంటి పరిస్థితి మన ప్రాంతంలో రాకూడదని, దీనికి ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై ఉండాలన్నారు. అలాగే సిటీ కల్చర్‌లో భాగంగా యువత ఎక్కువగా గంజాయికు బానిసై పలు వ్యాధులకు గురవుతూ తద్వారా ప్రాణాలు తీసుకుంటున్నారన్నారు. అలాంటి సంఘటనలు జరగకుండా ఉండటానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ముఖ్యంగా ప్రతి తల్లిదండ్రులు వారి పిల్లలు స్మార్ట్ మొబైల్ ద్వారా ఏమి చేస్తున్నారో ప్రత్యేక నిఘా ఉంచి, బెట్టింగ్, గంజాయి, ఇతర వ్యసనానికి పాల్పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా వాటికి అలవాటు పడి ఉంటే పోలీసులకు ఫిర్యాదు చేస్తే వారికి కౌన్సెలింగ్ ఇచ్చి ఆ వ్యసనాలను నుంచి దూరం చేస్తామన్నారు.

అక్రమ నిర్మాణం.. అడ్డుకట్ట వేయరేం..!

◆అనంత నగరంలో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు
◆ఎమ్మెల్యే ఆదేశిస్తున్నా చర్యలు శూన్యం
◆టౌన్ ప్లానింగ్ అధికారుల వింత ధోరణి
◆సిబ్బంది కొరతా సమస్యే..!

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్

అనంతపురం నగరంలో అక్రమ నిర్మాణాలను నిరోధించేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కార్పొరేషన్ అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఎమ్మెల్యే ఆదేశాలను అమలు చేయడంలో టౌన్‌ప్లానింగ్ అధికారుల నుంచి నిర్లక్ష్యం కొనసాగుతున్నట్లు క్షేత్రస్థాయిలో కన్పిస్తోంది. టౌన్‌ప్లానింగ్ అధికారుల పర్యవేక్షణ లేని కారణంగా నగరంలో యథేచ్ఛగా అక్రమ కట్టడాలు నిర్మితం అవుతున్నాయి. టౌన్‌ప్లానింగ్‌లో ఓ వైపు సిబ్బంది కొరత, మరోవైపు ఉన్నవారికి బాధ్యతలు అప్పగించకుండా విభాగాధిపతి, మరో ఉన్నతాధికారి ద్వంద్వ వైఖరి అవలంబిస్తుండడంతో అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయడం కష్టతరం అవుతోందనే చర్చ ఉద్యోగ వర్గాల్లో విన్పిస్తోంది.

టౌన్‌ప్లానింగ్‌లో సిబ్బంది కొరత..!

కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ విభాగంలో 16 మందికిపైగా సిబ్బంది ఉండాల్సి ఉండగా కేవలం ముగ్గురు మాత్రమే ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. వారిలో ఒకరు ఉద్యోగోన్నతిపై బదిలీ అయ్యారు. బదిలీ అయిన ఆ అధికారి డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. ఈనెల 15వ తేదీతో డిప్యూటేషన్ కాల పరిమితి ముగిసింది. కొన్ని రోజులుగా ఆ ఉద్యోగిని సెలవుపై వెళ్లారు. ప్రస్తుతం టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ శిరీష, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ మంజుల మాత్రమే విభాగం అంతటికీ ఫీల్డ్‌వర్క్ నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు పాతూరు ప్రాంతాన్ని టిపిఎస్ మంజుల పర్యవేక్షిస్తుండగా, మిగతా ప్రాంతమంతా టిపిఎస్ దుర్గాంజలి పర్యవేక్షిస్తున్నారు. దుర్గాంజలి డిప్యూటేషన్ గడువు ముగియటం తోడు ఆమె వ్యక్తిగత కారణాలతో సెలవులపై వెళ్లనున్నారు. ఈ క్రమంలో టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ శిరీష ఎక్కువగా కార్యాలయానికే పరిమితమవుతున్నారు. అనారోగ్య సమస్యలతో ఫీల్డ్‌వర్క్‌కు వెళ్లలేకపోతున్నట్లు ఆమె కూడా ఉన్నతాధికారులకు చెబుతున్నారు.

నిర్మాణాల్లో నిబంధనలకు పాతర

నగరంలో జరుగుతున్న పలు భవన నిర్మాణాలను పరిశీలిస్తే నిబంధనలు ఏమాత్రం పాటించనట్లు తెలుస్తోంది. భవన నిర్మాణాల ద్వారా లభించాల్సిన ఆదాయం భారీగా గండిపడుతున్నా అధికారులెవరూ దీనిపై దృష్టి సారించడం లేదు. సెలవులపై వెళ్లినవారు భవన నిర్మాణ అనుమతులు జారీ చేయడానికి వక్రమార్గాల అవలంబిస్తున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి వాటిని కట్టడి చేయకపోవడం చూస్తే అందులో ఉన్నతాధికారుల పాత్ర లేకుండా జరగదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. రెండు రోజుల క్రితం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ నగరంలోని అనధికార నిర్మాణాలను నిరోధించేందుకు చర్యలు చేపట్టాలని కమిషనర్ బాలస్వామి, ఇన్‌ఛార్జి ఎసిపి టిపిఒ శిరీషకు ఆదేశాలు జారీ చేశారు. ఈ అంశంపై టిపిఒ శిరీష మాట్లాడుతూ అర్బన్ ఎమ్మెల్యే కోరినట్లుగా అక్రమ కట్టడాల జాబితా తయారు చేసి అందజేస్తామని తెలిపారు.

నగరంలో సగభాగానికి పర్యవేక్షణాధికారులు లేకున్నా వాటిని భర్తీ చేసే దిశగా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టకపోవడం పలు అనుమానాలకు తావిచ్చేదిగా ఉంది. పాలనాపరమైన సమస్యలు పరిష్కరించి అధికార యంత్రాంగాన్ని ముందుకు నడిపించాల్సిన అధికారులే వాటిని నీరు కార్చే విధంగా వ్యవహరిస్తున్నారనే చర్చ సాగుతోంది. దీనికి తోడు మారిన టౌన్ ప్లానింగ్ నిబంధనలతో భవన ప్లాన్లను వేసే ఎల్‌టిపిలు, బిల్డర్లు ప్లాన్ల అనుమతి పొందడంలో నిర్మాణ లోపాలు, డివియేషన్ తదితర అంశాలకు సంబంధించి తామే బాధ్యత వహిస్తామని, ప్రభుత్వం చేపట్టే క్రిమినల్ చర్యలకు బాధ్యులవుతామని అఫిడవిట్ అందించాల్సి ఉంది. ఈ నిబంధనతో గడచిన రెండు నెలలుగా ఎల్‌టిపిలు, బిల్డర్లు ప్లాన్లను సమర్పించడానికి ముందుకు రాని పరిస్థితి నెలకొన్నట్లు తెలుస్తోంది. ఇలా అన్ని విధాలాలుగా భవన నిర్మాణాల్లో జరుగుతున్న లొసుగులు కార్పొరేషన్‌కు ఆదాయం సమకూర్చకపోగ, అక్రమాలకు తావిస్తోందనే విమర్శలు ఉన్నాయి. సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు దీనిపై స్పందించి కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్‌ను చక్కదిద్దిల్సిన అవసరం ఎంతైనా ఉందనే భావన ప్రజల నుంచి వ్యక్తం అవుతోంది.

జఖీవుల్లాకు అంతిమ వీడ్కోలు

పాల్గొన్న టిడిపి శ్రేణులు - పాడే మోసిన ఎమ్మెల్యే దగ్గుపాటి

జఖీవుల్లా భౌతికకాయం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి సవిత తదితరులు

జఖీవుల్లా పాడే మోస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

మాజీ ఎంపీ సైఫుల్లా కుమారుడు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కెఎం.జఖీవుల్లాకు అభిమానులు, టిడిపి శ్రేణులు అంతిమ వీడ్కోలు పలికారు. ఆదివారం నాడు గుండెపోటుతో మరణించిన జఖీవుల్లా పార్థివ దేహాన్ని అభిమానుల సందర్శనార్థం అనంతపురంలోని ఆయన నివాసంలో ఉంచారు. రాష్ట్ర మంత్రి ఎస్.సవిత, అనంతపురం, హిందూపురం పార్లమెంట్ సభ్యులు బికె.పార్థసారథి, అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, పరిటాల సునీత, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకట శివుడు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి హాజరై జకీవుల్లా పార్థివ దేహానికి టిడిపి జెండా కప్పి నివాళి అర్పించారు. తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి, వైఎస్‌ఆర్‌సిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డితో పాటు టిడిపి నాయకులు, ఇతర రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నేతలు పెద్ద ఎత్తున హాజరై జకీవుల్లా పార్థివ దేహానికి పూల మాలలు వేసి సంతాపం తెలిపారు. జఖీవుల్లా నివాసం నుంచి భౌతికకాయాన్ని అశోక్ నగర్ కబరస్తాన్‌కు తీసుకెళ్లారు. అక్కడే అంత్యక్రియలు నిర్వహించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి జకీవుల్లా భౌతిక కాయాన్ని మోసి తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ గౌస్‌మొద్దీన్, టిడిపి నాయకులు గడ్డం సుబ్రమణ్యం, ఆదినారాయణ, బుగ్గయ్య చౌదరి, లక్ష్మీపతి, రాయల్ మురళి, గుజరి వెంకటేష్, ఐఎంఎం మహబూబ్ బాషా తదితరులు హాజరై నివాళి అర్పించారు.

మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-బొమ్మనహాల్

స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌లో అర్జీలు ఇచ్చేందుకు వచ్చిన ప్రజలకు తహశీల్దార్ మునివేలు, టిడిపి నాయకుడు కొత్తపల్లి మల్లికార్జున మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ వేసవి దృష్ట్యా కలెక్టర్ ఆదేశాల మేరకు అర్జీదారులకు మజ్జిగ పంపిణీ చేశామన్నారు. ప్రజలెవరూ ఉదయం 11 గంటల పైన మధ్యాహ్నం 4 గంటల మధ్య ఎండలో బయట తిరగవద్దని సూచించారు. ఎండలు ఎక్కువగా ఉండడం వల్ల నీరు, మజ్జిగ, తదితర శీతల పానియాలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. అలాగే పలు జాగ్రత్తలను సూచించారు.

వక్ఫ్ సవరణ బిల్లుపై నిరసన

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

వక్ఫ్ చట్ట సవరణ బిల్లుకు వ్యతిరేకంగా సోమవారం కంబదూరులో ముస్లింలు నిరసన తెలిపారు. వారు నల్ల బ్యాడ్జీలు ధరించి జాతీయ జెండా చేత బట్టి శాంతియుతంగా భారీ ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని అంబేద్కర్ సర్కిల్‌కు చేరుకొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి వినతిపత్రం అందజేశారు. అనంతరం భారీ ర్యాలీగా పాత పోస్టాఫీస్ మీదుగా తహశీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకొని తహశీల్దార్ బాలకిషన్‌కు వినతి పత్రం సమర్పించారు.

నిరసన ప్రదర్శన చేస్తున్న ముస్లిములు

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి-రాయదుర్గం

వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

పట్టణ శివారులోని రాయదుర్గం-మొలకాల్మూర్ రోడ్డులో సోమవారం సాయంత్రం సిఐ జయా నాయక్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. ఓవర్ లోడ్‌తో వెళ్తున్న ఆటోలు, బైక్‌పై ట్రిపుల్ రైడింగ్ చేస్తున్న వారికి, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, డ్రైవింగ్ లైసెన్స్, తదితర పత్రాలు లేని వాటిని గుర్తించి జరిమానా విధించారు. రెండు ఆటోలను సీజ్ చేసినట్లు తెలిపారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

పాఠశాల విలీనాన్ని ఆపాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-శింగనమల

మండల పరిధిలోని రాచేపల్లి గ్రామం బీసీ కాలనీలో విలీనం పేరుతో పాఠశాలను తరలింపును ఆపాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సిద్ధు కోరారు. ఈమేరకు సోమవారం రాప్తాడు మండలంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాచేపల్లి గ్రామంలో ఎంపిపిఎస్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల 1 నుంచి 5వ తరగతి వరకూ మూడు రూములతో పాఠశాల నడుస్తోందన్నారు. అయితే ప్రభుత్వం తీసుకొచ్చిన విధానాల వల్ల 1, 2వ తరగతులను 3, 4, 5వ తరగతులను విడగొట్టి పక్కనున్న పాఠశాలలో కలిపే ప్రయత్నం చేస్తున్నారన్నారు. విద్యార్థి తల్లిదండ్రులు గతంలో మండల విద్యాధికారికి విన్నవించినా పట్టించుకోలేదన్నారు. కావున మీరైనా స్పందించి పాఠశాల విలీనాన్ని ఆపాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో ఎస్ఎఫ్ఐ నాయకులు, విజయ్, విద్యార్థి, తల్లిదండ్రులు రమేష్, రవి, రవీంద్ర, బాలు, జయప్రకాష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

బసవేశ్వర జయంతిని అధికారికంగా నిర్వహించడం అభినందనీయం

గవిమఠం పీఠాధిపతులు చెన్నబసవ రాజేంద్ర మహాస్వామి

మాట్లాడుతున్న చెన్నబసవ రాజేంద్ర మహాస్వామి

ప్రజాశక్తి-ఉరవకొండ

జగజ్యోతి, వీరశైవ ధర్మ వ్యవస్థాపకులు మహాత్మ బసవేశ్వరుల జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేయడం అభినందనీయమని గవిమఠం పీఠాధిపతులు చెన్నబసవ రాజేంద్ర మహాస్వాములు, ఉత్తరాధికారి కరిబసవ రాజేంద్ర మహాస్వాములు అన్నారు. సోమవారం స్థానిక గవిమఠంలో నియోజకవర్గ వీరశైవ సంక్షేమ సమాజం ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బసవ జయంతిని అధికారికంగా గుర్తించడంతో రాష్ట్రంలోని వీరశైవులందరూ ప్రభుత్వానికి రుణపడి ఉంటారన్నారు. ప్రధానంగా సిఎం చంద్రబాబు, రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే వీరశైవులను ఓబీసీలుగా గుర్తించేందుకు కృషి చేయాలన్నారు. ఇకపోతే ఉరవకొండలో మే 1వ తేదీన నిర్వహించనున్న బసవ జయంతి వేడుకలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తాలూకా వీరశైవ సంక్షేమ సమాజం కమిటీ సభ్యులు పాటిల్ నాగనగౌడ్, పాటిల్ నిరంజన్‌గౌడ్, దేశాయ్ వీరేష్, మోపిడి చంద్రమౌళి, చీకులగురికి బొజ్జప్ప, సత్యనారాయణ, రాకెట్ల వీరేష్‌స్వామి, మల్లాపురం యోగిస్వామి, జయరామిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, నీలకంఠ, డిష్ మల్లికార్జున, రామ్మోహన్, దేశాయ్ ఎర్రిస్వామి, మేటి నాగరాజు, దేశాయ్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

విరివిగా ఉపాధి పనులు కల్పించాలి : ఎంపిడిఒ

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ భాస్కర్

ప్రజాశక్తి-నార్పల

మండలంలోని టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు సమన్వయంతో వ్యవహరించి కూలీలకు విరివిగా ఉపాధి హామీ పనులు కల్పించాలని ఎంపిడిఒ భాస్కర్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా చాలా ఏళ్లుగా పని చేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు పంచాయతీలను మారుస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరూ వలసలు వెళ్లకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కావున మండలానికి కొత్తగా వచ్చిన టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు సమన్వయంతో పని చేసి గ్రామాల్లో కూలీల సంఖ్య పెంచాలన్నారు. ఈ సమావేశంలో ఉపాధి హామీ ఎపిఒలు ఎర్రమ్మ, రమేష్, రామారావు, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఎంపిటిసి శంకర్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

అసంబద్ధ ఆరోపణలు మానుకోండి

గాస్పల్ చర్చి సొసైటీ సభ్యులు

మాట్లాడుతున్న గాస్పల్ చర్చ్ సొసైటీ సభ్యులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

లేనిపోని అసంబద్ధమైన ఆరోపణలు చేయడం మాని ఆధారాలతో మీడియా వేదికగా చర్చకు రావాలని గాస్పల్ చర్చి సొసైటీ సభ్యులు ప్రొఫెసర్ పిలిప్, విజయ్‌కుమార్, సంపత్ కుమార్, ఎలమందయ్య, డేవిడ్ రాజు అన్నారు. సోమవారం వారి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గాస్పల్ చర్చి సొసైటీ నిధుల్లో అక్రమాలు జరిగాయంటూ కొందరు చేసి ఆరోపణలన్ని అవాస్తవాలు అన్నారు. గాస్పల్ అసెంబ్లీ 2017 సంవత్సరంలో ఏడు మంది సభ్యులతో ఆంధ్రప్రదేశ్ సొసైటీ చట్టం ప్రకారం రిజిస్టర్ అయిందన్నారు. ఆరోజు నుంచి వరప్రసాద్ రెడ్డి సెక్రటరీగా ఉన్నారని, అన్నింటికీ ఆయన సంతకాలు ఉన్నాయన్నారు. ఇప్పుడు తమ మీద అనవసరమైన ఆరోపణలు చేస్తూ మేము అక్రమాలకు పాల్పడ్డామని, మీడియా సమావేశంలో వెల్లడించారని, ఆధారాలతో సహా నిరూపించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వారు చెప్పిన విషయాలకు ఆధారాలు చూపించాలని లేకుంటే పరువు నష్టం దావా వేస్తామన్నారు. 50 సంవత్సరాల నుండి బైబిల్ బోధిస్తున్న వరప్రసాద్ రెడ్డి ఈర్ష్యా, ద్వేషం, అసూయలతో ఇలా మాట్లాడటం అన్యాయంగా ఉందన్నారు.

అట్టహాసంగా 'భాష్యం' వార్షికోత్సవం

చిన్నారికి ట్రోఫీ అందజేస్తున్న సిఐ శ్రీకాంత్‌యాదవ్

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని జీసస్‌నగర్‌లో ఉన్న భాష్యం విద్యాసంస్థల వార్షికోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థుల నృత్య ప్రదర్శనలు, యోగాసనాలు ఆహూతులను అలరించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన 2వ పట్టణ ఇన్స్‌పెక్టర్ శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యశించి తల్లితండ్రుల ఆశయాలకు అనుగుణంగా ఉన్నత శిఖరాలు చేరుకోవాలని పిలుపునిచ్చారు. భాష్యం విద్యాసంస్థల్లో తాను కూడా చదివానని గుర్తు చేశారు. విద్యాసంస్థల్లో ఉన్నతమైన, నాణ్యమైన విద్యను అందిస్తున్న ఏకైక విద్యాసంస్థ భాష్యం అని కొనియాడారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ట్రోఫీ, మొమెంటోలు, పతకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఛైర్మన్ రామకృష్ణ, వైస్‌ఛైర్మన్ హనుమంతురావు, డైరెక్టర్ సాకేత్ రామ్, రాయలసీమ సిఇఒ అనిల్‌కుమార్, అనంతపురం జోన్ జెడ్ఇఒ రవివర్మ, ప్రిన్సిపాళ్లు బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉచిత శిక్షణ తరగతులు

శిక్షణకు హాజరైన అభ్యర్థులు

గుంతకల్లు : డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీసాయి ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో 75 రోజులపాటు నిరుద్యోగులకు నిర్వహించిన ఉచిత శిక్షణ తరగతులు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు సభలో శ్రీ శంకరానంద డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ రామకృష్ణ నాయుడు మాట్లాడుతూ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో 75 రోజులుపాటు నిరుద్యోగులకు పోటీ పరీక్షలపై శిక్షణ ఇవ్వడం సంతోషంగా ఉంన్నారు. అనంతరం శిక్షణ ఇచ్చిన అధ్యాపకులను ఆర్‌కె నాయుడు సన్మానించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కసాపురం రమేష్, అధ్యాపకులు తారకేష్, పక్కీరప్ప, రామకృష్ణ, హనుమంతురెడ్డి, శేషఫణి, రాజు, రాజశేఖర్, మల్లికార్జున, తిమ్మప్ప, డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సురేంద్రబాబు, ఎస్ఎఫ్ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టెక్నికల్ అసిస్టెంట్లు బాధ్యతల స్వీకరణ

యల్లనూరు : బదిలీపై మండలానికి వచ్చిన ఫీల్డ్ అసిస్టెంట్లు సోమవారం బాధ్యతలు స్వీకరించినట్లు ఎంపిడిఒ వాసుదేవరరెడ్డి తెలిపారు. మండలంలో ఐదేళ్ల విధులు నిర్వహించిన ఉపాధి హామీ సిబ్బందిని బదిలీ చేసిన విషయం తెలిసిందే. దీంతో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన టెక్నికల్ అసిస్టెంట్లకు పంచాయతీలు కేటాయించినట్లు తెలిపారు.

'ఉపాధి' బిల్లులు చెల్లించాలి

వ్యకాసం ఆధ్వర్యంలో ఎంపిడిఒకు వినతి

వినతిపత్రం అందజేస్తున్న వ్యకాసం, సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-పామిడి

ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ తేజోష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు దాదాపు 9 నుంచి 10 వారాలుగా బిల్లులు చెల్లించకపోతే కూలీలు ఏం తిని బతకాలని ప్రశ్నించారు. వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే అడిగిన వారందరికీ పనులు కల్పించాలన్నారు. పనులు చేసే చోట కనీస సౌకర్యాలు మంచినీళ్లు, నీడ, టెంటు, మెడికల్ కిట్లు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, పనిముట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రతి జాబ్‌కార్డుకూ 200 రోజులు పనిదినాలు కల్పించాలని, పెరిగిన ధరలకు అనుకూలంగా రోజు వేతనం రూ.600 ఇవ్వాలని, మేట్లకు పారితోషకం ఇవ్వాలని, పనుల వద్ద ప్రమాదవశాత్తు చనిపోయిన కూలీలకు రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు అనిమిరెడ్డి, మండల కార్యదర్శి మల్లేష్, రైతుసంఘం నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, ముత్యాలు, నరసింహులు, శివకుమార్, రామాంజి, నాగరాజు, జాఫర్, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' చట్టాన్ని రక్షించండి

'కష్టజీవుల' పాదయాత్రలో మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్

ప్రజాశక్తి-నార్పల

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ కోటేశ్వరరావు అధ్యక్షతన సోమవారం మండల పరిధిలోని బండ్లపల్లి గ్రామంలో నుంచి ప్రారంభమైన కష్టజీవుల పాదయాత్రను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పనిని పరిరక్షించుకోవడంలో కూలీల పాత్ర అత్యంత కీలకమన్నారు. ఉపాధి భృతి సంవత్సరానికి రూ.12వేలు ఇవ్వాలని, ఉపాధి పనులు కల్పించి వలసలు ఆపాలని, సకాలంలో వేతనాలు చెల్లించాలని, 200 రోజులు పని దినాలు కల్పించి, రోజు కూలి రూ.700 ఇవ్వాలని, ఉపాధి చట్టాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయరాదని, ఉపాధి హామీకి బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం వాటా కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జగదీష్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి వెంకట్రావు, సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్, సత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పాళ్యం నారాయణస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, రంగయ్య, కేశవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ అధ్యక్షులు దాదాగాంధీ, తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి ఎస్‌కెయు పీజీ డిప్లొమా సర్టిఫికెట్ ఫైనల్ పరీక్షలు

ప్రిన్సిపల్ కృష్ణకుమారి

మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కృష్ణకుమారి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఆర్‌డిటి ప్రొఫెషనల్ స్కూల్‌లో చదువుతున్న ఫారిన్ లాంగ్వేజ్ రెసిడెన్షియల్ బ్యాచ్‌కు ఎస్‌కెయూ పీజీ డిప్లమా సర్టిఫికెట్ కోసం జూలై 21న ఫైనల్ పరీక్ష నిర్వహించనున్నట్లు శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.కృష్ణకుమారి, ఫ్యాకల్టీ ఆఫ్ ల్యాంగ్వేజస్, లిటరేచర్ డీన్ జి.నరసింహన్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ డైరెక్టర్ కె.నాగభూషణ రాజు, ఎడ్యుకేషన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆర్‌డిటి డైరెక్టర్ జి.మోహన్ మురళి తెలిపారు. సోమవారం ఎస్‌కెయు కళాశాలలో ఆర్‌డిటి సిబ్బంది, ఎస్‌కెయూ పరీక్షల విభాగాల సిబ్బందితో ప్రిన్సిపాల్ కృష్ణకుమారి ఆధ్వర్యంలో ఇంటర్నల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్‌డిటి ప్రొఫెసనల్ స్కూల్‌లో చదువుతున్న ఫారిన్ లాంగ్వేజ్ రెసిడెన్షియల్ బ్యాంక్ ఎస్కెయూ పీజీ డిప్లమా సర్టిఫికేట్ కోసం ఫైనల్ పరీక్షలు నిర్వహించేందుకు నిర్ణయించామన్నారు. ఫైనల్ పరీక్షలు జూలై 21న నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెషనల్ స్కూల్ ఆర్‌డిటి ప్రిన్సిపాల్ జి.గీతాంజలి, ఆర్‌డిటి కోఆర్డినేటర్ జోష్ ఆంటోనియో, డైరెక్టర్ ఆఫ్ ఎవల్యూషన్ ప్రొఫెసర్ జివి.రామన్, ఎస్‌కెయూ సిఇ ప్రొఫెసర్ సి.లోకేశ్వర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్, స్కిల్ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ కృష్ణుడు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సానుకూల దృక్పథంతో మెలగాలి

గుత్తిలో మాట్లాడుతున్న మండల విద్యాధికారి

ప్రజాశక్తి-గుత్తి

పరీక్షల్లో ఎలాంటి ఫలితాలు వచ్చినా విద్యార్థులు సానుకూల దృక్పథంతో మెలగాలని గుత్తి, పెద్దవడుగూరు మండలాల విద్యాధికారులు బి.రవినాయక్, గురు ప్రసాద్ సూచించారు. సోమవారం పట్టణంలోని కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయంలో గుత్తి, పామిడి, పెద్దవడుగూరు, గార్లదిన్నె, యాడికి మండలాల కేజీబీవీ విద్యార్థులు, తల్లిదండ్రులకు 'మార్కులే జీవితమా' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షల ఫలితాల తర్వాత ఎలాంటి అఘాయిత్యాలకి పాల్పడరాదన్నారు. పరీక్షల ఫలితాల అనంతరం బాలికలకు వివాహం చేయరాదన్నారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో విద్యా కౌన్సిలర్ సుజాత, ప్రిన్సిపాల్ రుద్రాక్షి, ఐదు మండలాల ప్రిన్సిపాల్ లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : విద్యార్థులు బాగా చదువుకుని ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని జిల్లా సమగ్ర శిక్ష గైడెన్స్ మెంటార్ హెల్త్ కౌన్సిలర్లు లక్ష్మీపతి, ప్రసాద్ సూచించారు. సోమవారం ఉరవకొండలోని కేజీబీవీలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ధనలక్ష్మి ఆధ్వర్యంలో కూడేరు, విడపనకల్, గుంతకల్లు కేజీబీవీల్లో విద్యనభ్యసిస్తున్న 10వ తరగతి విద్యార్థులతోపాటు తల్లిదండ్రులకు భవిష్యత్ గైడెన్స్‌కు సంబంధించి మార్కులే కాదు జీవితమా? అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ మండల విద్యాశాఖ అధికారులు ఈశ్వరప్ప, రమాదేవి, ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలపై హర్షం

శింగనమల : ప్రభుత్వం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడంపై రాష్ట్ర తెలుగు యువత మాజీ కార్యదర్శి మాసూలు చంద్రమోహన్ సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రతిపక్షంలో చేపట్టిన యువగళం పాదయాత్రలో తాము అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీ విడుదల చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆ హామీ మేరకు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడం సంతోషకరమన్నారు. ఈ డీఎస్సీలో 16,347 ఉపాధ్యాయ పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేయడంపై నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు.

'మెగా కాదు.. కోతల డీఎస్సీ'

అనంతపురం : కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ పేర విడుదల చేసిన నోటిఫికేషన్ కోతల డీఎస్సీ అని వైఎస్ఆర్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్‌యాదవ్ విమర్శించారు. సోమవారం నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మొదటి సంతకం అని చెబుతూ 11 నెలల తర్వాత డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. ఇందులో కూడా టీచర్ పోస్టుల నియామక ప్రక్రియపై నిర్దిష్ట ప్రణాళిక లేకుండా లక్షలాదిమంది అభ్యర్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం ఆటలాడటం మంచిది కాదన్నారు. ఉమ్మడి జిల్లాలో 24వేల మందికిపైగా అభ్యర్థులు ఉండగా 202 పోస్టులు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు కైలాష్, ఐటీ విభాగం నగర అధ్యక్షులు మల్లెల పవన్, మంజునాథ్‌రెడ్డి, జగదీష్, జశ్వంత్‌రెడ్డి, నరేంద్రరెడ్డి, వేణు, సమీర్, రవితేజ, ఉదయ్, జీవన్, బాషా, రాహుల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

పుట్లూరు : మండల కేంద్రంలో ఉన్న గ్రంథాలయానికి దాదాపు 150 పుస్తకాలను బాలాపురం పంచాయతీ కార్యదర్శి పి.వెంకట్ నాయుడు సోమవారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్ నాయుడు మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఈ పుస్తకాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. పేద విద్యార్థులు, నిరుద్యోగుల కోసం ఉపయోగపడే పుస్తకాలను విరాళంగా ఇచ్చిన పి.వెంకట్‌నాయుడుకు గ్రంథాలయ అధికారి జయరాములు కృతజ్ఞతలు తెలిపారు.

చెట్లు నరికిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని వినతి

పెద్దవడుగూరు : మండలంలోని చిత్రచేడుకు చెందిన నలుగురు ఎస్‌సి సామాజిక వర్గానికి చెందిన రైతుల పొలంలో ఈనెల 17న మామిడిచెట్లను నరికిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ నాయకులు ఆదినారాయణ, భూపతి, కత్తుల కొండయ్య, రంగస్వామి, కుమార్ మాట్లాడుతూ చిత్రచేడుకు చెందిన ఎస్‌సి రైతులు లక్ష్మన్న, సూర్యనారాయణ, రమేష్, అనిల్ పొలాల్లో ఐదేళ్లుగా సాగు చేసుకున్న మామిడి చెట్లను నరికివేయడం బాధాకరమన్నారు. వెంటనే చెట్లను నరికిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యతో బంగారు బాటలు వేసుకోండి

బెలుగుప్ప : విద్యార్థులు విద్యలో బంగారు బాటలు వేసుకోవాలని మండల విద్యాధికారి పి.మల్లారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిధిలోని హనిమిరెడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఎన్ఎంఎంఎస్ సాధించిన విద్యార్థి వై.శైలును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాల, హరినాథ్, ఉపాధ్యాయులు హారిక, రేణుక, గాయత్రి, భారతి, హరిబాబు, హుస్సేన్‌పీరా, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ చిన్నారులకు ప్రభుత్వ స్కూల్లో అడ్మిషన్

అంగన్వాడి విద్యార్థులతో శంకరమ్మ, ప్రభుత్వం ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-తాడిపత్రి

పట్టణంలోని నంద లపాడు 1వ అంగన్వాడీ సెంటర్ నుంచి ప్రభుత్వ స్కూల్లో అడ్మిషన్ పొందడానికి అంగన్వాడీ టీచర్ శంకరమ్మ విద్యార్థులతో కలిసి అడ్మిషన్ కోసం దరఖాస్తు కోరారు. నాలుగు, ఐదు సంవత్సరాల చిన్నారులు అంగన్వాడీ సెంటర్‌లో విద్యనభ్యసించిన 9 మంది విద్యార్థులను ఆరో సంవత్సరం కావడంతో ప్రభుత్వ స్కూల్లో 1వ తరగతికి చేరడానికి తల్లిదండ్రుల అనుమతితో ప్రభుత్వ స్కూల్లో చేర్పించారు. వీరి జూన్ 12న ప్రభుత్వ పాఠశాలకు వెళ్లనున్నట్లు తెలిపారు.

డిప్యూటీ కమిషనర్‌గా పావని బాధ్యతలు స్వీకరణ

కమిషనర్‌కు బొకే అందజేస్తున్న డిప్యూటీ కమిషనర్ డి.పావని

అనంతపురం కార్పొరేషన్ : అనంతపురం నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్‌గా డి.పావని సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ముందుగా కమిషనర్ బి.బాలస్వామిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, రాజమండ్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, కమిషనర్ (ఎఫ్ఎసి) చింతలపూడి నగర పంచాయతీ నుండి అనంతపురం నగరపాలక సంస్థకు బదిలీ అయ్యారు. అధికారులు సిబ్బంది ఆమెకు స్వాగతం పలికారు.

గేట్స్‌లో 'ఎ వన్ ఆవిష్కరణలు'

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గుత్తి : గేట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం మెకానికల్ ఇంజినీరింగ్‌లో 'ఎ వన్ ఆవిష్కరణలు' అనే అంశంపై గెస్ట్ లెక్చర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జెఎన్‌టియు మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ కళ్యాణిరాధా ముఖ్య అతిథిగా హాజరై ఆధునిక మెకానికల్ వ్యవస్థలు, డిజైన్ ప్రక్రియలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పరివర్తన పాత్ర వంటి అంశాలపై వివరించారు. ప్రిడిక్టివ్ మెయింటెనెన్స్, స్మార్ట్ తయారీ, డిజైన్ ఆప్టిమైజేషన్ లాంటి రంగాల్లో ఏ వన్ టెక్నాలజీలను ఏకీకరణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ వికె పద్మావతమ్మ, ప్రిన్సిపాల్ సుధాకర్, మెకానికల్ హెచ్‌ఒడి ఖయ్యూం, తదితరులు పాల్గొన్నారు.

రాయితీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుత్తి : స్వయం ఉపాధి కోసం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రాయితీ రుణాల కోసం నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్‌మియా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో 27 యూనిట్ల కేటాయించినట్లు తెలిపారు. అర్హులైన నిరుద్యోగులు ఆన్‌లైన్, మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఉపకరణాలు పంపిణీ

నార్పల : మండలంలోని బొందలవాడ గ్రామంలో వయోవృద్ధులకు, విభిన్న ప్రతిభావంతుల ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం మంజూరు చేసిన ఉపకరణాలను సోమవారం పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచు ఆలం వెంకట నరసానాయుడు, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నేడు భూముల కౌలుకు బహిరంగ వేలం

పామిడి : మండలంలోని నెమళ్ళపల్లి గ్రామంలో ఉన్న ఆంజనేయ, ఈశ్వర, పోతులరాజు దేవత దేవస్థానాలకు సంబంధించిన వ్యవసాయ భూములు సాగు చేసుకునేందుకు మంగళవారం కౌలుకు వేలంపాట నిర్వహించనున్నట్లు దేవాదాయ శాఖ ఇఒ కృష్ణయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు ఉదయం 11 గంటలకు మండలంలోని నెమళ్ళపల్లి గ్రామంలో వేలంపాట ఉంటుందన్నారు. కావున రైతులు పాల్గొనాలని కోరారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

ఉరవకొండ : ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం మంచిది కాదని జనసేన పార్టీ మండల అధ్యక్షులు బోయ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల ఫిర్యాదుల వేదికలో తహశీల్దార్ మహబూబ్‌బాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు దేవేంద్ర, భోగేష్, రఘు, మని, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి

అవగాహన కల్పిస్తున్న ఐసిడిఎస్ సూపర్‌వైజర్

పుట్లూరు : గర్భిణులు, బాలింతలు అంగన్వాడీల్లో అందజేసే పోషకాహారాన్ని తీసుకోవాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శాంతమ్మ సూచించారు. పోషణ పక్వాడ్ పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం పుట్లూరు-3 అంగన్వాడీ కేంద్రంలో పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా వెయ్యి రోజుల సంరక్షణ గురించి గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పుట్లూరు సెక్టార్ పరిధిలోని 22 మంది అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బీరువా వితరణ

బీరువాను అందజేస్తున్న దృశ్యం

గుత్తి : మండలంలోని బేతాపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బీరువాను అందజేశారు. గుత్తికి చెందిన లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు, దివంగత ఎల్‌వి కృష్ణారెడ్డి సతీమణి రాధ, కుమారుడు డాక్టర్ మధుసూదన్‌రెడ్డి సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో బీరువాను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం మహాలక్ష్మి, ఉపాధ్యాయులు ఓబుళపతి, రామకృష్ణయ్య, సులోచన, శివప్రసాద్, రవీంద్రనాథ్‌రెడ్డి, సుజాత, సాధన, కళ, రత్నకుమారి, నిరుపమ, మాదన్న, శ్రీదేవి, చంద్ర. నరేంద్రనాథ్ పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 30 మంది ఎంపిక

గుత్తి : పట్టణంలోని పిఆర్‌ఆర్ ఎంబిఎ కళాశాల, శ్రీసాయి డిగ్రీ కళాశాలల్లో శ్రీబాలాజీ ఎడ్యుకేషన్ సొసైటీ ఛైర్మన్ పల్లె కృష్ణకిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 30 మంది ఎంపికయ్యారు. ప్రముఖ కంపెనీలు ఐ యాక్టివ్, ఆల్ డిగి వంటి కంపెనీల ప్రతినిధులు నిర్వహించిన ఇంటర్వ్యూలకు 120 మంది విద్యార్థులు హాజరుకాగా 30 మంది విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేసుకున్నట్లు కంపెనీల ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీసాయి క్యాంపస్ సిఇఒ ఎ.శ్రీరాములు, పిఆర్‌ఆర్ ఎంబిఎ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ప్రసన్నకుమార్, శ్రీసాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సి.వెంకటేశ్వర్లురెడ్డి, ఎస్‌బిఐఎస్ ప్లేస్‌మెంట్ అధికారి బాబా పాల్గొన్నారు.


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

నేరాలు ఘోరాలు

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పుట్లూరు : మండల పరిధిలోని గాండ్లపాడు-జి.వెంకన్నపల్లి గ్రామాల మధ్యలో ఉన్న పొలాల వద్ద సోమవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ వెంకట నరసింహ తెలిపారు. మృతుడి వయస్సు 50 నుంచి 60ఏళ్ల మధ్యలో ఉంటుందన్నారు. మృతదేహం కుళ్లిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందన్నారు. విషయం తెలుసుకుని సీఐ సత్యబాబు ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించిన అనంతరం మృతదేహాన్ని తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. ఎవరైనా ఆచూకీ తెలిస్తే తాడిపత్రిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సంప్రదించాలని కోరారు.